అల్లూరి సీతారామరాజు

గోరాపూర్ రోడ్డుపై కూలిన చెట్టు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని ఆంధ్ర ఒడిశా సరిహద్దు అరుకు, చటువ మధ్యలో గోరాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలోని రోడ్డు వద్ద మంగళవారం ఉదయం భారీ వృక్షం కూలింది. ఆంధ్ర -ఒడిశా బోర్డర్ అరకుచటువకు ప్రధాన రోడ్డు కావడంతో ఇక్కడ నిత్యం వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వృక్షం రోడ్డుపై నేల కోరగడంతో సుమారు గంట పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానిక గ్రామస్తులతో పాటు వాహనదారులు చెట్టు కొమ్మలను తొలగించడంతో వాహన రాకపోకలు యధావిధిగా జరిగాయి.

కూలిన చెట్టు

కార్మికులకు పథకాలు అందించాలి

-సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు- అరకులోయలో ర్యాలీ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:రాష్ట్ర ప్రభుత్వం 1214 సర్క్యులర్ రద్దు చేసి, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను అందించాలని సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు.అరకులోయ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భవన నిర్మాణం కార్మిక సంఘం, ఇతర కార్మిక సంఘాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం పెట్రోల్ బంక్ నుండి మండల తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేసిందని, 12 రకాల సంక్షేమ పథకాలు భవన నిర్మాణ కార్మికులకు రాకుండా తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. ఇప్పుడున్న తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికలకు ముందు భవన నిర్మాణ కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందజేస్తామని హామీ ఇచ్చిందని, దీన్ని నిలబెట్టుకోవాలన్నారు. వీటితో పాటు 60 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పెన్షన్, వికలాంగ పెన్షన్, చదువుకోవడానికి స్కాలర్షిప్ తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఎన్నికల ముందు ఇసుక ఉచితంగా ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని తెలిపారు.పెండింగ్ లో ఉన్న లేబర్ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల వర్కర్స్ యూనియన్ నాయకులు గోవిందు, పెయింటింగ్ అసోసియేషన్ కార్యదర్శి కొండబాబు, కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ ప్రభుదాసు, శ్రీను, తాపీ మేస్త్రీల సంఘం నాయకులు సత్తిబాబు, రామ్ చందర, సోమినాయుడు, రాడ్ బెండర్స్ వర్కర్స్ యూనియన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

బాల్య వివాహాలను అరికట్టాలి

-స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి

సీమంతం చేస్తున్న చిన్మయిదేవి

ప్రజాశక్తి - చింతపల్లి : గ్రామాలలో మూఢ నమ్మకాలు, బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి కోరారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల ముగింపు కార్యక్రమం చింతపల్లిలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో స్థానిక ఐసిడిఎస్ సిడిపిఓ జీవి రమణి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్మయిదేవి మాట్లాడుతూ, బాల్య వివాహాలు చేసుకోవడంతోనే చిన్న వయసులో గర్భం దాల్చి రక్తహీనత ఏర్పడుతుందన్నారు. తద్వారా గర్భస్థ శిశువు బరువు, ఎత్తులలో తారతమ్యాలు ఏర్పడుతున్నాయన్నారు. సరైన సమయంలో వివాహాలు చేసుకోవడం, సరైన పౌష్టికాహారం తీసుకోవడంతోనే పిల్లలు ఆరోగ్యవంతంగా జన్మించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మన్య ప్రాంతంలో రసాయన ఎరువులు వాడకుండా, ప్రకృతి సహజ సిద్ధంగా లభించే సేంద్రియ ఆహార పదార్థాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. అటువంటి వాటి ద్వారా ఎన్నో పోషక విలువలు లభిస్తాయన్నారు. కూరగాయలు, ఆకుకూరలతో పాటు చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా అనేక రుగ్మతలకు దూరంగా ఉండవచ్చన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత, కాచి చల్లార్చిన నీటిని తాగడం, వేడి పదార్థాలను భుజించడం ద్వారా వ్యాధుల బారిన పడే అవకాశం నుంచి తప్పించుకోవచ్చున్నారు. ప్రతి గ్రామంలో అంగన్వాడి కార్యకర్తలు పోషకాహార ప్రాముఖ్యతను గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు కిశోర బాలికలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వివరించవలసిన ఆవశ్యకత ఉందన్నారు.

తహసిల్దార్ రామకష్ణ మాట్లాడుతూ, ఆకుకూరల్లోనే అన్ని పోషక విలువలు ఉన్నాయన్నారు.స్థానిక సర్పంచ్ పుష్పలత, ఎంపీడీవో ఆశాజ్యోతి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోపి నాయక శారద, ఎంపీటీసీ సభ్యులు దాసరి ధారాలక్ష్మి, చింతాడ జయలక్ష్మి, కొయ్యూరు సిడిపిఓ విజయ్ కుమారి, స్థానిక ఏ సి డి పి ఓ రామలక్ష్మి, సూపర్వైజర్లు సత్యవతి, అప్పలనరస, గౌరీ, విజయ కుమారి, ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఎం మహాసభలను జయప్రదం చేయాలి

-పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి -హుకుంపేట: అల్లూరి జిల్లా పాడేరులో డిసెంబర్ 2 నుండి 5 వరకు నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ కార్యదర్శి అప్పలనర్స కోరారు. మండల కేంద్ర లోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో భారీ వర్షాలు, వరదలకు రైతుల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, పరిహారం తక్షణమే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్‌ను కేంద్రం తెస్తుందన్నారు.రాష్ట్రాలు, ఎన్నికైన శాసనసభల హక్కులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అనంత గిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు, హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సొంటేన హైమావతి, జన్ని సుబ్బారావు, మండల నాయకులు తమార్బ అప్పల కొండ పడాల్, దూరు క్రిష్ణా మూర్తి, కొర్ర అప్పారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రభుత్వ మద్యం దుకాణ సిబ్బంది నిరసన

నిరసన చేపడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:ప్రభుత్వ మద్యం దుకాణంలో పని చేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మండలంలోని అరుకు ప్రభుత్వ మద్యం దుకాణం మూసివేసి ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మద్యం దుకాణ సిబ్బంది క్రిష్ణ, సురేష్, సన్యాసిరావు, సోమేశ్వరరావు మాట్లాడుతూ అయిదేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణంలో పని చేస్తూ కుటుంబాలను నెట్టుకు వస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రైవేటు దుకాణాల ఏర్పాటుకు చర్యలు చేపట్టిందన్నారు. దీనిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమ కుటుంబాలు వీధిన పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రాత పరీక్ష ద్వారా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎంపికై పని చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ భద్రత కల్పించి అదుకోవాలని వారు కోరారు.

'నిధి'లో ఎపిజిఎల్ఐ సేవలు పొందాలి

ప్రజాశక్తి -పాడేరు: నిధి పోర్టల్ ద్వారా ఎపిజిఎల్ఐ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత భీమా) సేవలను పొందాలని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఏ.పి.జి.యల్.ఐ సంయుక్త సంచాలకులు ఎం. ఝాన్సి లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం కేంద్రంగా విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలలోని ప్రభుత్వ ఉదోగులకు జీవిత బీమా సేవలు అందిస్తుందని ఆమె తెలిపారు. గత మే 24 నుండి రాష్ట్ర వ్యాప్తముగా ఏ.పి.జి.యల్.ఐ సేవలు ఆఫ్ లైన్ నుండి నిధి పోర్టల్ నందు ఆన్లైన్‌కు మార్చడం జరిగిందన్న విషయాన్ని పాలసీదారులు గుర్తించి సేవలను ఆన్లైన్ లోనే పొందాలని సూచించారు. మే 24 నుండి నేటి వరకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలో ఏ.పి.జి.యల్.ఐ పాలసీదారులకు చెందిన 1368 పరిణితి, మరణ క్లైములు, 503 ఋణ ధరఖాస్తులను ఆమోదించి వారి డిడిఓల నిధి పోర్టల్ లాగిన్ కు పంపడమైందని తెలిపారు. డిడిఓలు నిధి పోర్టల్ లాగిన్‌కు వచ్చిన ఏ.పి.జి.యల్.ఐ కార్యాలయము వారు ఆమోదించిన క్లైము, లోనుల చెల్లింపులకు సిఎఫ్ ఎంఎస్ ద్వారా బిల్లు జనరేట్ చేయవలసి ఉందన్నారు. జనరేట్ చేసిన బిల్లుల చెల్లింపులకు సి ఎఫ్ఎంఎస్ ద్వారా సబ్మిట్ చేయాలని సూచించారు. ఉద్యోగి బేసిక్ పే స్లాబ్ రేట్ ప్రకారం మొదటి పాలసీ బాండ్‌ను కార్యాలయ డిడిఓ నిధి లాగిన్ లో మాత్రమె జనరేట్ చేయాలని, వారి ప్రీమియంను మొదట నెల జీతం బిల్లులో రికవరీ పెట్టవలెనని తెలిపారు. పాలసీదారులకు వారి వారి నిధి పోర్టల్ లాగిన్‌లో బేసిక్ పేలో 15శాతం వరకు స్వచ్ఛందంగా పెంచుకొనే సౌలభ్యం కల్పించబడిందని వివరించారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేగం

1/70 చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

- ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:గిరిజన ప్రాం తంలో 1/70 చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరించారు. మంగళవారం అరకులోయ మండలం పద్మపురం మేజర్ పంచాయితీ కేంద్రంలో పర్యటించి పంచాయితీ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఆరా తీశారు. గిరిజన ప్రాంతంలో 1/70 చట్టాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు చేతుల్లోకి తీసుకుంటే చర్యలు కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులకు అనుమతులు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు.పంచాయితీ పరిధిలో అక్రమ నిర్మాణాల వివరాలను రెండు రోజుల్లో అందించాలన్నారు. పంచాయతీ కార్యాలయంలో అటెండెన్స్, లివ్ రిజిస్టర్ డేటా సరిగా లేక పోవటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.ఉద్యోగం బాధ్యతగా చెయ్యాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపునకు హాజరై ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.ఈ కార్యక్రమంలో పద్మపురం పంచాయితీ సర్పంచ్ పెట్టేలీ సుస్మితా, మండల తహశీల్దార్ పద్మపురం పంచాయితీ అధికారులు ఉన్నారు.

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములు కావాలి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలో చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని అల్లూరి జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయం ప్రాంగణం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు మంగళవారం నిర్వహించిన స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత శ్రమదానం ర్యాలీలో కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఐటీడీఏ ప్రాంగణంలో చెత్తాచెదారాన్ని శ్రమదానంతో పరిశుభ్రం చేశారు. ఐటీడీఏ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, పలు ప్రభుత్వ కార్యాలయాల అధికారులు సిబ్బందితో మానవహారం నిర్వహించి పరిశుభ్రత గురించి నేను వేసిన ఈ ముందడుగును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని, భారతదేశాన్ని శుభ్రపరచడంలో నావంతు సమయం కేటాయిస్తానని కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు శ్రమదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రజలందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దుకాణాల దగ్గర చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, ఐటీడీఏ ఏపీఓ డిఎన్వి.రమణ, రంపచోడవరం సర్పంచ్ యం.బొజ్జయ్య, డిఎల్‌డిఓ కోటేశ్వరరావు, డివిజనల్ పంచాయతీ అధికారి అబ్బులు, ఇఓపిఆర్‌డి జాన్ విల్సన్, ఎంపీడీవో హరికృష్ణ, ఎస్ఓ మార్తమ్మ పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవలో భాగంగా కొబ్బరి బొండాలు ఎత్తిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు

విజేతగా నిలిచిన నెల్లపాక విద్యార్థులు

ప్రజాశక్తి-ఎటపాక

ఎపి జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని నెల్లిపాక జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ పరీక్షల్లో నెల్లిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నల్లకుంట ఆశ్రమ పాఠశాల, గొల్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు రాశారు. ఇందులో నెల్లిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలోనూ, నల్లకుంట ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలోనూ, గొల్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలోనూ నిలిచారు. విజేతలకు యుటిఎఫ్ మండల కమిటీ తరపున ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాగర్, కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు డివిజన్, జిల్లా స్థాయి పరీక్షల్లో తమ ప్రతిభ చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లిపాక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం చంద్రయ్య, ఉపాధ్యాయులు విజయ్, ఎస్.రవితేజ, యం.భద్రయ్య, చిచ్చడి రామారావు పాల్గొన్నారు.

పాడేరులో చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎటపాకలో విజేతలతో జెవివి, యుటిఎఫ్ నాయకులు

పాడేరు : చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా మంగళవారం అల్లూరి జిల్లా పాడేరు డివిజన్లో ఏడు మండలాల్లో మండల స్థాయి చెకుముకి పోటీలు జరిగాయి. సెప్టెంబర్ 25న జరిగిన పాఠశాల స్థాయి చెకుముకి పోటీల్లో 49 పాఠశాలకు చెందిన 2200 మంది విద్యార్థులు పాల్గొనగా 147 మంది మండల స్థాయికి అర్హత సాధించారు. మండల స్థాయి పోటీలకు ఐదు మండలాల నుండి 49 పాఠశాలకు చెందిన 147 మంది విద్యార్థులు మంగళవారం హాజరయ్యారు. వీరిలో అరకువేలీ కేజీబీవీ, పెదబయలు సెయింట్ ఆన్స్, పాడేరు అక్షర, జి.మాడుగుల ఏపిఆర్, చింతపల్లి సెయింట్ ఆన్స్ పాఠశాలలు విజయం సాధించాయి. ఈ పాఠశాలలు 27వ తేదీన జరిగే జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు హాజరుకావాలని జె వివి నాయకులు యండమూరి పారయ్య, నాగేశ్వరరావు, శేషాద్రి తెలిపారు.

లాజిస్టిక్స్ కేంద్రంగా తీర ప్రాంతం అభివృద్ధి

ప్రజాశక్తి-చింతూరు

సముద్ర తీర ప్రాంతం లాజిస్టిక్స్ కేంద్రంగా అభివృద్ధి చెంతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రత్న మాణిక్యం అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం, రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "రాష్ట్రం తూర్పు తీరాన లాజిస్టిక్స్ కేంద్రంగా ఎదగడం, సుస్థిర ప్రభుత్వం- డిజిటల్ సుపరిపాలన సాధించటం" అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పరిపాలన వ్యవస్థలో కంప్యూటర్స్‌ను విరివిరిగా ఉపయోగించటం జరుగుతుందన్నారు. విద్యార్థినీ విద్యార్థులు కూడా కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకొని 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణంధ్రప్రదేశ్‌గా తీర్చిదిడటంలో భాగస్వామ్యులు కావాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ తూర్పు తీర ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్స్‌కు కేంద్ర స్థానంగా ఆవిర్భవించే అవకాశం ఉందన్నారు. వాణిజ్య శాస్త్ర విభాగధిపతి జి. హారతి, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ఎస్.అప్పనమ్మ మాట్లాడారు. ప్రభుత్వ విభాగాలన్ని సమన్వయంతో పనిచేయడం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. డిజిటల్ సుపరిపాలన ద్వారా పారదర్శకత, జవాబుదారితనం, అమలు ప్రక్రియల్లో వేగవంతం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రత్న మాణిక్యం

వరద నష్టపరిహారం చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-కూనవరం : ఇటీవల వచ్చిన వరదలకు నష్టపోయిన వారికి ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ మండలంలోని కూటూరు సచివాలయం వద్ద వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ముంపు మండలాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ బాధితులేనని, ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, సర్పంచ్ బొగ్గ వెంకమ్మ, ఆవుల మురళి, ఉపేంద్ర, మడెం బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీమంతుల వెంకటరమణ, వేంకటాద్రి సత్యనారాయణ, గౌతురావు తదితరులు పాల్గొన్నారు.

చూచిరేవుల గూడెంలో వినతి

మండలంలోని చూచిరేవుల గూడెం ఎంపిటీసీ జయసుధ ఆధ్వర్యంలో పంచాయితీ కార్యదర్శికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయసుధ మాట్లాడుతూ వరద బాధితులకు తమ పంచాయితీలోని ప్రజలకు నష్టపరిహారం అందలేదని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేలు చెప్పున తక్షణమే చెల్లించాలని కోరారు. బాధిత ప్రజలు మాట్లాడుతూ గోదావరి వరదలకు పనులు లేక ఇబ్బంది పడ్డామని, పంటలు కూడా దెబ్బతిని రైతులు నష్ట పోయారని అందరికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

ధర్నా అనంతరం వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు, బాధితులు

పింఛన్ల పంపిణీని పరిశీలించిన కలెక్టర్

పింఛన్ల పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-మారేడుమిల్లి :మండల కేంద్రం మారేడుమిల్లి గ్రామంలోని దొరవీధిలో సామాజిక పింఛన్లను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ మంగళవారం ఉదయం లబ్ధిదారులు ఇండ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం గత నెల 22న జలతరంగిణి జలపాతం వద్ద మెడికల్ విద్యార్థులు గల్లంతైన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ పర్యాటక ప్రాంతంలో పూర్తిగా భద్రత వలయాలు ఏర్పాటు చేసిన తర్వాతే పర్యటకులను అనుమతించాలని అటవీశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీర కిషోర్, వైస్ ఎంపీపీ యల్.రవికుమార్, మారేడుమిల్లి పంచాయతీ సర్పంచ్ కొండ జాకోబ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల శ్రమదానం

శుభ్రం చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-పాడేరు:స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా ఐటిడిఏ కార్యాలయంలో మంగళవారం శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు. ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు విఎస్ ప్రభాకర్‌రావు, ఎం. వెంకటేశ్వరరావు, పరిపాలనాధికారి ఎం.హేమలత, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్ కుమార్ తదితరులు పాల్గొని ఐటిడిఏ కార్యాలయం ఆవరణలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ గిరిజన సంక్షేమ అధికారి ఎల్.రజిని, స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ బి.కళ్యాణి, ఐటిడిఏ సిబ్బంది తదితరులు పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు.

యోగాతో ఆరోగ్యం

యోగా చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -పాడేరు : జిల్లా కేంద్రంలోని లోచలి పుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ప్రణవ సంకల్ప యోగా సమితి వ్యవస్థాపకులు, ఇండియన్ యోగ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పతంజలి శ్రీనివాస్ నిర్వహిస్తున్న యోగా శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా యోగా గురు శ్రీనివాస్ మాట్లాడుతూ, యోగా సాధన తో విద్యార్థులలో ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందించవచ్చునని తెలిపారు.ఐటీడీఏ పరిధిలో 117 ఆశ్రమ గురుకుల పాఠశాలలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జివి ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్, యోగ శిక్షకులు హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రయివేటీకరణ ఆలోచన విరమించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచనను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జీ వామనమూర్తి డిమాండ్ చేశారు.ఈనెల 1,2,3 తేదీల్లో రాష్ట్రవ్యాప్త ప్రజా ఉద్యమానికి మద్దతుగా అక్కయ్యపాలెం నరసింహనగర్ రైతు బజార్ రోడ్డులో ఆటోడ్రైవర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వరంగ సంస్థలకు కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టాలన్న కేంద్రం చర్యలు దుర్మార్గమన్నారు. బొగ్గు, ముడిసరుకు అందకుండా చేసి స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసి తద్వారా నష్టాలసాకుతో ప్రయివేటుకు కట్టబెట్టాలనుకున్న కేంద్ర చర్యలపై రాష్ట్రంలోని ఎంపిలు, ఎమ్మెల్యేలు ప్రకటనలకే పరిమితం కాకుండా కార్యాచరణకు దిగాలన్నారు. అఖిలపక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లేలా సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై ఒత్తిడి చేయాలన్నారు. నాలుగువేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించాలన్న చర్యలు మానుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్ జోలికి వస్తే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ధర్నాలో రావి కృష్ణ, జి శ్రీనివాస్, పి సాయికుమార్, జి గణేష్, ఎరికి నాయుడు, జి సూరిబాబు, ఎం రాము, టి.కృష్ణ, యాకోబ్ పాల్గొన్నారు.

డిఆర్‌డిఒ డైరెక్టర్ జనరల్‌గా హరప్రసాద్

ఆర్‌వి.హరప్రసాద్

ప్రజాశక్తి -కరాస: డిఆర్‌డిఒ నూతన డైరెక్టర్ జనరల్‌గా జోధ్‌పూర్ డిఫెన్స్ లాబొరేటరీ డైరెక్టర్ జనరల్ (నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్) ఆర్‌వి. హరప్రసాద్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ చేసి, హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి మైక్రోవేవ్ అండ్ రాడార్ ఇంజినీరింగ్ డిగ్రీ పొందిన హరప్రసాద్, 1988లో హైదరాబాద్ డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ లాబొరేటరీ (డిఎల్‌ఆర్‌ఎల్)లో చేరాడు. ఇటీవలి వివిధ అధునాతన సిస్టమ్‌లను ట్రైసర్వీస్‌లకు డెలివరీ చేయడం, ప్రవేశపెట్టడంలో వివిధ హోదాల్లో పనిచేశాడు. 2003-05లో (డిఆర్‌డిఒ థింక్ ట్యాంక్ గ్రూప్ జి ఫాస్ట్ సభ్యుడిగా పనిచేశాడు. 2022 జూలైనుంచి జోధ్‌పూర్‌లోని డిఫెన్స్ లాబొరేటరీ డైరెక్టర్‌గాపనిచేశారు వ్యూహాత్మక ప్రాంతాలలో సాంకేతికతలు, ప్రాజెక్ట్‌ల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు.

దసరా సెలవులు పాటించాల్సిందే

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఈ నెల 3 నుంచి 13 వరకు దసరా సెలవులను రచ్చితంగా పాటించాల్సిందేనని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో శత శాతం సెలవులు అమలుపైకమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో అన్ని జిల్లాల ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. దసరా సెలవులు అమలులో ఎవరికీ ఎటువంటి మినహాయింపులు ఉండబోవన్నారు, దసరా సంబరాలు, ఇతరత్రా పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే ఒబాలల హక్కుల ఉల్లంఘనలుగా భావించి క్రిమినల్ చర్యలతో పాటు ఆయా పాఠశాలల గుర్తింపు రద్దుకు సిఫారసుచేస్తామన్నారు. దీనిపై apscpcr2018@gmail.com మెయిల్‌కు ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

రహదారిపై గండి పూడ్చరూ..?

వాతంగి -భోగిపాలెం బిటి రహదారిపై పడిన గండి

ప్రకాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని వాతంగి -భోగిపాలెం గ్రామాల మధ్య బీటీ రహదారిపై పడిన గండిని తక్షణం పూడ్చాలని, ఆ ప్రాంతంలో కాలవర్టు నిర్మించాలని లోదొడ్డి సర్పంచ్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మంగళవారం అధికారులను కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ రహదారికి పెద్దపెద్ద గండ్లు పడ్డాయని, ఈ రహదారి మీదుగా వందలాది మంది నిత్యం రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో గండ్లు పడడం వలన రాకపోకలు దాదాపుగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో గిరిజనుల ఇబ్బందుల నేపథ్యంలో తక్షణం అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు మంగళవారం లోతా రామారావు స్థానిక గిరిజన సంక్షేమ కార్యాలయం సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.

నేడు ఏకలవ్య స్కూల్స్ ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని

ప్రజాశక్తి-పాడేరు : రూ.40 కోట్ల వ్యయంతో ఆధునిక వసతులతో నిర్మించిన రెండు ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలను భారత ప్రధాన మంత్రి ప్రారంభిస్తారని ఐటిడిఏ పి. ఓ వి.అభిషేక్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 2వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు పెదబయలు, అరకు వ్యాలీ మండలాల్లో నిర్మించిన ఇ.ఎం.ఆర్. ఎస్ పాఠశాలలను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అదే విధంగా మరో రూ.40 కోట్లతో నిర్మించనున్న అనంతగిరి, హుకుంపేట మండలాలలో నిర్మించనున్న రెండు ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలరే శంకుస్థాపనలు చేస్తారని అన్నారు.

నయ్యర్‌ను కలిసిన పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు:కేంద్ర ప్రభుత్వ గిరిజన వ్యవహారాల శాఖ కార్యదర్శి విభు నయ్యర్‌ను ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ జార్కండ్ రాష్ట్రంలోని హజారీబాగ్‌లో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ఖ్యాతిని అర్జించిన అరుకు కాఫీ పొడిని సెక్రటరీకి అందజేశారు. ఐటీడీఏ పరిధిలో అమలు చేస్తున్న జన్ మన్ కార్యక్రమంలో చేపట్టిన వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై చర్చించారు. గిరిజన అభివృద్ధికి మరిన్ని నిధులు కేంద్ర ప్రభుత్వం నుండి మంజూరు చేయాలని పి.ఓ కోరారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

ఓటరు నమోదు పత్రాన్ని ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని యుటిఎఫ్ బృందం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు చేడుతున్నారు. యుటిఎఫ్ అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పుడిగి దేముడు ఆధ్వర్యాన మండల నేతలు వివి.ఈశ్వరరావు, నారాజీ, మల్లేశ్వరరావు, తదితరులు బృందాలుగా ఏర్పడి ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను కలిసి ఓటరు నమోదు పత్రాలను అందస్తున్నారు. టోకురు ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాల ఉపాధ్యాయులకు ఓటరు నమోదు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల సిబ్బంది పాల్గొన్నారు

కెజిహెచ్ నుంచి అనధికారికంగా వెళ్లిపోయిన విద్యార్థి

ప్రజాశక్తి-కొయ్యూరు : అనారోగ్యానికి గురైన విద్యార్థికి అధికారులు దగ్గరుండి కెజిహెచ్‌లో వైద్య సేవలు అందిస్తుండగా, డిశ్చార్జి ఇవ్వకుండా అనధికారికంగా ఆ విద్యార్థిని తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లిపోయారు. ఎటిడబ్ల్యుఒ క్రాంతి కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం... చింతపల్లి మండలం కొడసింగి గ్రామానికి చెందిన కొర్రా సురేష్ కొయ్యూరు మండలం డౌనూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సురేష్ అస్వస్థతకు గురి కావడంతో ఎటిడబ్ల్యుఒ క్రాంతికుమార్, ప్రధానోపాధ్యాయుడు ప్రభుదాస్ పట్టుపట్టి సురేష్‌ను విశాఖపట్నం కెజిహెచ్‌లో సెప్టెంబర్ 25న చేర్పించారు. కేజీహెచ్‌ల భావనగర్ వార్డులో వైద్య సేవలు పొందుతున్నాడు. ఆసుపత్రిలో సహాయంగా విద్యార్థి తండ్రి రాముడుతో పాటు హెచ్‌డబ్ల్యుఒ కె.హరిదేవ్ ఉన్నారు. విద్యార్థి స్వల్పంగా కోలుకోవడంతో మరో నాలుగు రోజుల్లో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు చెప్పారు. ఇంతలోనే సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు హెచ్‌డబ్ల్యుఒ హరిదేవ్ రిపోర్ట్ తీసుకోవడానికి ల్యాబ్‌కు వెళ్ళిన సమయంలో తల్లిదండ్రులు విద్యార్థి సురేష్‌ను తీసుకొని స్వగ్రామానికి వెళ్లి పోయారు. నాటు వైద్యం చేయించడానికి స్వగ్రామానికి వెళ్లి ఉంటారని, విద్యార్థికి ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఐటిడిఏ పిఒ ఆదేశాల మేరకు ఎంతో వ్యయ ప్రయాసలపడి విశాఖ కెజిహెచ్‌కు తరలించి మెరుగైన వైద్య సేవలు అందిస్తుండగా, ఇలా వైద్యం పూర్తి కాకుండా స్వగ్రామానికి వెళ్ళిపోవడంపె ఎటిడబ్ల్యుఒ క్రాంతి కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

విలువలతోనే వైద్య వృత్తిలో రాణింపు

గీతం వైద్య విద్యార్థుల 'వైట్‌కోట్' ధారణలో చైర్మన్ శ్రీభరత్

మాట్లాడుతున్న గీతం చైర్మన్, ఎంపి శ్రీభరత్

ప్రజాశక్తి -మధురవాడ: వైద్యవృత్తిలో రాణించాలంటే అంకితభావం,సామాజిక బాధ్యతతో ఎదగాలని స్వీయ ప్రతిభను పెంచుకోవాలని కృత్రిమ మేధ వంటి సాంకేతికను ఉపయోగించుకోవాలని గీతం అధ్యక్షుడు, ఎంపీ ఎమ్.శ్రీభరత్ అన్నారు. గురువారం గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) వైద్య కళాశాలలో 2024 బ్యాచ్ నూతన ఎంబిబిఎస్ విద్యార్థులకు 'వైట్‌కోట్ ధారణ'లో మాట్లాడుతూ, రానున్న రోజులలో వైద్యరంగంలోకి సాంకేతిక పరిజ్ఞానం కీలక భూమిక పోషించనుందన్నారు. అయితే వృత్తి నైపుణ్యం, మానవ సంబంధాలు, రోగ లక్షణాలను విశ్లేషించి రోగికి మానసికంగా ధైర్యం చెబుతూ వైద్యులు అందించే చికిత్సకు ప్రత్యామ్నాయం లేదన్నారు. ఒత్తిడికి లోనవకుండా వైద్య విద్యార్థులు వృత్తిలోని నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఎపి అధ్యక్షుడు డాక్టర్ ఎమ్.జయచంద్రనాయుడు మాట్లాడుతూ వైద్య వృత్తిలోకి ప్రవేశించే వారు నిరంతర విద్యార్థిగా ఉండాలని, విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని, రోగుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విశాఖ సిపి డాక్టర్ శంకబ్రత బాగ్చీ మాట్లాడుతూ మానవత విలువలు, సమాజం పట్ల బాధ్యతతో వైద్య వృత్తిలోకి ప్రవేశించాలని సూచించారు.

కార్యక్రమంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, జిమ్‌సర్ ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్.పి.రావు, గీతం ఆసుపత్రి సూపరెండెంట్ డాక్టర్ వసంతకుమార్ పాల్గొన్నారు. వైద్య విద్యార్థులకు సిపి తెల్లకోటును అందజేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సందీప్ ఎంపిక

సందీప్‌ను అభినందిస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: సెప్టెంబర్ 30న కాకినాడ డిఎస్ఏ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ జిల్లా స్థాయి స్పోర్ట్స్ సెలక్షన్స్ బాలుర విభాగంలో అండర్ -17 కబడ్డీ పోటీల్లో రాజవొమ్మంగి జెడ్‌పి హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న డి.సందీప్ కుమార్ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక జెడ్‌పి హైస్కూల్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఎస్ఎంసి చైర్మన్ ఎం.శ్రీనువాస్, మండల విద్యాశాఖ అధికారి కెవీవీ సత్య నారాయణ దొర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డీవీ గోపాలకృష్ణ సందీప్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పిడి పాల్‌బాబు, పిఈటిలు నాగరాజు, రేష్మ, ఉపాధ్యాయులు బొజ్జియ్య తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని రాప, ఓల్డా పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం మండల అగ్రికల్చర్ ఆఫీసర్ లీలావతి మాట్లాడుతూ. రైతులు పంటలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించి ఆర్గానిక్ పద్ధతిలో పంటలు పండించేందుకు రైతులు అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్దతులు, ఈ పంట నమోదుపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎఒ

బోరు నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఖంద్రుమ్ పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో నూతన బోరు నిర్మాణానికి స్థానిక ఆ పంచాయతీ సర్పంచ్, మండల అధ్యక్షుడు కే.హరి మంగళవారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు భరోసా కేంద్రాల్లో వివిధ పనుల నిమిత్తం వచ్చే గిరిజనులకు, రైతులకు తాగునీటి సమస్య లేకుండా ఉండాలని బోరు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, కేందాస్, బలరాం, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

డిఎవిలో గాంధీ జయంతి, దసరా

దుర్గాదేవి, గాంధీజీ వేషధారణలో విద్యార్థులు

ప్రజాశక్తి -సీలేరు : జీకే.వీధి మండలం సీలేరు డిఏవి పాఠశాలలో గాంధీ జయంతి, దసరా ఉత్సవాలు మంగళవారం ముందస్తుగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల భాగంగా అమ్మవారి దశావతారాలు వేషధారణలతో విద్యార్థులను ముస్తాబు చేసి ప్రదర్శించారు. గాంధీ జయంతి వేడుకలు ఘనంగా పాఠశాలలో నిర్వహించారు. గాంధీ తాత వేషధారణతో విద్యార్థులు అలరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. కిరణ్ కుమార్ గాంధీజీ విశిష్టతను విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

అద్దె భవనంలో నిర్వహణపై అధికారులకు నివేదిక

అంగన్వాడీలో లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-అడ్డతీగల : అడ్డతీగల మండలం, కినపర్తి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని అడ్డతీగల జెఎఫ్‌సిఎం కోర్టు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ వాలంటీర్లు తీగల బాబురావు, కారు అరుణ కుమారి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ ఎంపాటి రాఘవ, ఆయా మాడెం మరిడమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం లేదని, అద్దె ఇంట్లో నెలకు రూ.1000 ఇచ్చి సెంటర్ నడిపిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రెండు, మూడు ఇల్లులు మారామని, ప్రస్తుతం ఉన్న ఇల్లు వర్షానికి కారిపోతుందని పేర్కొన్నారు. ఆట వస్తువులు కూడా సరిగా లేవని, పిల్లలు పడుకున్న బల్లలు కూడా వేరే సెంటర్ నుండి తీసుకొచ్చామని చెప్పారు. తమకు సొంత భవనం కావాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన వారు జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్‌కి ఈ విషయాన్ని రిపోర్టు చేస్తామని పారా లీగల్ వాలంటీర్లు బాబురావు, అరుణ కుమారి తెలిపారు.

నూతన ఎస్ఐని కలిసిన జనసేన నేతలు

నూతన ఎస్ఐతో జనసేన నేతలు

ప్రజాశక్తి- విఆర్.పురం : విఆర్ పురం మండల పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన యం సంతోష్ కుమార్‌ను మంగళవారం మండల జనసేన నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, మండల కార్యదర్శి బాగుల అంజన్‌రావు మండల పరిస్థితులు, పలు అంశాలపై ముచ్చటించారు. శాంతి భద్రతలపై తమ పార్టీ ఎప్పుడు సహకరిస్తుందని తెలిపారు. యస్ఐని కలిసిన వారిలో నాయకులు కోట్ల రామ్మోహన్ రెడ్డి, పెట్ట నాగేంద్ర కుమార్, ముంజాపు సాయిరాం, మాదిరెడ్డి శ్రీనివాస్, ముంజపు శ్రీరామ్, ముత్యాల దుర్గా ప్రసాద్, కోట్ల సాయిబాబు తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి- మాధవధార : అగ్ని ప్రమాదాల నివారణపై హోటల్స్ నిర్వాహకులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి కెవిటి ప్రసాద్ అన్నారు. మంగళవారం 51వ వార్డు, ఆర్ అండ్ బి జంక్షన్ వద్ద మారియట్ హోటల్ సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ మాక్ డ్రిల్ నిర్వహించారు. హైడ్రన్స్, స్మోకింగ్ డిటెక్టర్స్, స్పింకలెర్స్ వంటి అత్యవసరమైనవాటిని నిత్యం అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మాన్ ఎ.చిరంజీవి, ఆర్ చిన్న పాల్గొన్నారు.

ధరాభారంపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి -మధురవాడ : విచ్చలవిడిగా పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలను తగ్గించాలని సిపిఎం మధురవాడ జోన్ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ధరాభారంపై మధురవాడ మార్కెట్ కూడలి వద్ద నిరసన చేపట్టారు. ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మధురవాడ జోన్ కమిటీ కార్యదర్శి డి అప్పలరాజు మాట్లాడుతూ, కేంద్రంలో మూడోసారి బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు విపరీతంగా పెరిగి పేద,మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మూడునెలలుగా కూరగాయలు, కిరాణా సామాన్ల ధరలు విపరీతంగా పెరిగి, దినసరికూలీల జీవనం దుర్భరమౌతోందని వాపోయారు. నిరుద్యోగులు తీవ్ర నిరాశ, నిస్పృహల్లో ఉన్నారన్నారు. సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో పి.రాజ్‌కుమార్, డి కొండమ్మ, బి భారతి, టికె.శారద, కె.సుజాత, డి. తులసి, వాసంతి, ప్రసన్న పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి- గాజువాక :ఉచిత ఇసుక పాలసీనికూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని 76వ వార్డు గాంధీనగర్ సచివాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎం రాంబాబు, డి రమణ మాట్లాడుతూ ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులుఆందోళన చెందుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారానికి రాకముందు యార్డుల్లో పుష్కలంగా ఇసుక నిల్వలు ఉండేవని, మూడు నెలల్లో అంతా ఖాళీ చేసిన నేపథ్యంలో ఆ ఇసుక ఎక్కడికి వెళ్ళిందో చెప్పాలన్నారు. దీనిపై సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు జి.లక్ష్మి, రామచంద్ర నగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు అర్జున్, రాజారావు, త్రినాధరావు, రాము పాల్గొన్నారు.

నేటి నుంచి వైజాగ్ ఓపెన్ గోల్ఫ్ టోర్నీ

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రతిష్టాత్మక ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా(పిజిటిఐ), విశాఖలోని ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 5 వరకు వైజాగ్ ఓపెన్ 2024 పేరుతో గోల్ఫ్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ కార్యదర్శి ఎంఎస్ఎన్ రాజు తెలిపారు. మంగళవారం ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, టోర్నీ విజేతలకు రూ.కోటి బహుమతిగా అందజేస్తామన్నారు. టోర్నీ నిర్వహణకు హోస్ వెన్యూ ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్, అసోసియేట్ పార్టనర్స్‌గాను, అల్వార్‌దాస్ గ్రూప్, ఎస్ఆర్‌కె ఇన్నా, విజయనగర్ బయోటెక్ ప్రవేట్ లిమిటెడ్, ఎస్ఎల్‌బి వెంచర్స్ సహకారం అందిస్తున్నారన్నారు. దేశంలోని ప్రఖ్యాత గోల్ఫ్ ఆటగాళ్లతో పాటు 15 దేశాల గోల్ఫ్ ఆటగాళ్లుటోర్నీలో పాల్గొంటారన్నారు. ఈ టోర్నీని ప్రఖ్యాత ఛానళ్లు యూరోస్పోర్ట్, ఎబిపి ప్రసారం చేయనున్నట్టు తెలిపారు. ఈ టోర్నీ ద్వారాప్రొఫెషనల్ గోల్ఫ్ ఆటగాళ్ళతో కలిసి పోటీ పడే అవకాశాన్ని క్లబ్ ఆటగాళ్ళకు దక్కుతుందన్నారు. పిజిటిఐ సిఇఒ ఉత్తమ్ సింగ్ ముండి మట్లాడుతూ రెండోసారి ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌కు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కొత్త ఆటగాళ్ళకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు.